సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం : 9 : నవంబర్ : 2023



సోమశిలలో 29.91 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారానికి 29.91 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 484 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,470
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,610
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,778
నవర (8 గ్రాములు)	రూ.46,224

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.1 /24.5

గాలిలో తేమ 79 శాతంగా బుధవారం నమోదైంది. జిల్లాలో గురువారం అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

జిల్లాలో 19.3 మిల్లీమీటర్ల వర్షపాతం

నెల్లూరు(దర్గామిట్ట): ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. సగటున 19.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా లింగసముద్రంలో 71.2, కావలిలో 65.6, బుచ్చిరెడ్డిపాళెంలో 42.6, కోవూరులో 41.8, ఆత్మకూరులో 37.2, నెల్లూరు అర్బన్‌లో 29.4, తోటపల్లిగూడూరులో 29.2, వెంకటాచలంలో 26.6, మర్రిపాడులో 26.4, అల్లూరులో 24.6, కొండాపురంలో 24.2, బోగోలులో 23, ఉలవపాడులో 22.2, అనుమసముద్రంపేటలో 22.2, విడవలూరులో 21.6, జలదంకిలో 17.4, కొడవలూరులో 17.2, దగదర్తిలో 16.8, నెల్లూరు రూరల్‌లో 16.4, సంగంలో 13.2, సైదాపురంలో 13.2, వలేటివారిపాళెంలో 12.4, మనుబోలులో 12.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ

నెల్లూరు (పొగతోట): ఉపాధి పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్, ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులై 18 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని చెప్పారు. బయోడేటా, రేషన్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఎస్సార్టీపీ ట్రైనింగ్ సెంటర్, వీఆర్సీ సెంటర్ లేదా గ్రామీణాభివృద్ధి సంస్థ జాబ్స్ విభాగంలో నిర్వహించనున్న స్క్రీనింగ్ క్యాంపునకు హాజరుకావాలని కోరారు. కంప్యూటర్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్, ఇంటర్వ్యూ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తదితరాల్లో శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, రెండు జతల యూనిఫారం, మెటీరియల్, సర్టిఫికెట్‌ను ఇవ్వనున్నామన్నారు. స్టయ్‌ఫండ్‌గా రూ.272ను రోజూ ఇవ్వనున్నారని, వివరాలకు 94935 13896, 98855 53344 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సామాజిక సాధికార బస్సు యాత్ర నేడు

కావలి: సామాజిక సాధికార బస్సు యాత్రను కావలి నియోజకవర్గంలో గురువారం నిర్వహించనున్నామని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం ఆయన తెలియజేశారు. బోగోలు మండలం కడనూతలలోని ఆరెస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ రంగాల నిపుణులతో ఆత్మీయ సమావేశాన్ని మధ్యాహ్నం 12కు నిర్వహించనున్నామని చెప్పారు. అనంతరం బస్సు యాత్ర జాతీయ రహదారి మీదుగా మద్దూరుపాడు వద్ద 2.30కు కావలి పట్టణంలోకి ప్రవేశించనుందని వివరించారు. పట్టణంలోని జెండా చెట్టు సెంటర్‌లో వైఎస్సార్, అబ్దుల్ కలామ్ విగ్రహాలకు నివాళులర్పించనున్నారని పేర్కొన్నారు. అనంతరం అక్కడే ఉన్న దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, పాదయాత్రగా బయల్దేరి పొట్టి శ్రీరాములు విగ్రహ కూడలికి 4.30కు చేరుకోనున్నారని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రముఖులు మాట్లాడనున్నారన్నారు. మంత్రి అప్పలరాజు, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, నెల్లూరు నగర, కర్నూలు ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్, హఫీజ్‌ఖాన్, పార్టీ ఎస్సీ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొననున్నారని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యవర్గ ఎన్నిక



కార్యవర్గ సభ్యులు

నాయుడుపేట టౌన్: హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని నిర్వాహకుడు స్వామినాయక్ తెలిపారు. తుమ్మూరులోని టీటీడీ కల్యాణ మండపంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ నెల్లూరు జిల్లా సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలను జరిపారు. నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా నాయుడుపేటకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జయరామయ్య, ఉపాధ్యక్షుడిగా మోహన్ (వరికుంటపాడు), కార్యదర్శిగా సారేపల్లి రవికుమార్ (అల్లూరు), కోశాధికారిగా వేమిరెడ్డి సనత్‌కుమార్‌రెడ్డి (నెల్లూరు), కార్యవర్గ సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు. హిందూ ధర్మ ప్రచార మండలి గౌరవ సభ్యులు సుబ్రహ్మణ్యం, విజయ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ రమణయ్య, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై నిరంతర ఫోకస్

పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యంగా ఇప్పటికే ఎన్నో సంస్కరణలను చేపట్టిన ప్రభుత్వం తాజాగా మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బోధన.. సకాలంలో సిలబస్‌ను పూర్తి చేయడం.. పరీక్షల నిర్వహణ.. ఉపాధ్యాయుల విధులు.. తదితరాలను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టింది. పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పూర్తి స్థాయిలో వసతుల కల్పనే లక్ష్యంగా ప్రతి మండలానికీ ఇద్దరు ఎడ్యుకేషన్ ఆఫీసర్లను నియమించింది. వీరికి పని విభజన కల్పిస్తూ పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు.



తరగతి గదిలో విద్యార్థులు (ఫైల్)

ప్రతి మండలానికీ ఇద్దరు ఈఓలు
- బోధన, నిర్వహణపై తరచూ తనిఖీలు
- ప్రభుత్వ విధానాలు అమలయ్యేలా చర్యలు

జిల్లాలో పాఠశాలలు:	విద్యార్థుల సంఖ్య
3446 (ప్రభుత్వ, ప్రైవేట్)	2.9 లక్షల మందికిపైగా..

నెల్లూరు(టౌన్): రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, వర్చువల్ బోధన, టోఫెల్ విధానంలో పరీక్షలు, సీబీఎస్‌ఈ సిలబస్, తొమ్మిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ తదితరాలను పక్కాగా అమలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లోనూ పకడ్బందీగా అమలయ్యేలా ఇద్దరు ఎంఈఓలు పర్యవేక్షించనున్నారు.

ఇష్టారాజ్యానికి చెక్

పరీక్షల నిర్వహణలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇక నుంచి వీరి ఆటలు సాగేందుకు అవకాశం ఉండదు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నిర్దేశించిన నిబంధనల మేరకు పరీక్షలు, బోధన తదితరాలను పక్కాగా అమలు చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 3446 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలున్నాయి. వీటిలో 2659 ప్రభుత్వ, 787 ప్రైవేట్ పాఠశాలలు. ఇందులో 2.9 లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. వాస్తవానికి అకడమిక్ పుస్తకాలతోనే విద్యాబోధన సాగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయా తరగతులకు ఫార్మెటివ్, సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తోంది. అయితే ఈ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పరీక్షలను నిర్వహిస్తున్నాయి. అకడమిక్ పుస్తకాలను వినియోగించకుండా సొంత మెటీరియల్‌ను విద్యార్థులకు అంటగట్టి ఇష్టారాజ్యంగా బోధన సాగిస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ వ్యవహారాలను చక్కదిద్దేందుకు గానూ ప్రతి మండలానికీ ఇద్దరు ఈఓలను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నియమించింది.



దర్గామిట్టలోని జెడ్పీ ఉన్నత పాఠశాల

ఎంఈఓల విధులు ఇలా..
- జిల్లాలో 38 మండలాలకు గానూ 38 మంది ఎంఈఓ – 1.. 37 మంది ఎంఈఓ – 2లను నియమించారు.
- ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను సందర్శించడం .. తనిఖీ.. ఉపాధ్యాయులకు శిక్షణ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన కార్యక్రమాలు అమలయ్యేలా పర్యవేక్షణ.. పాఠశాలల్లో అవసరమైన వాటిని అంచనా వేసే బాధ్యతను ఎంఈఓ – 1కు కేటాయించారు.
- అడ్మినిస్ట్రేషన్ పరంగా పాఠశాలల స్థాపన.. గుర్తింపు.. బలోపేతం చేయడం.. ఉపాధ్యాయుల సర్వీస్ అంశాలతో పాటు అధికారులు కేటాయించిన ఇతర విధులను వీరు నిర్వర్తించనున్నారు.
- పాఠశాలల సంసిద్ధత.. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్.. బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం.. ఒకేషనల్ ఎడ్యుకేషన్.. ప్రత్యేకావసరాలు గల పిల్లలకు సంబంధించిన విషయాలు.. చైల్డ్ డేటా బేస్.. యూ డైస్ నిర్వహణ.. తదితరాలను ఎంఈఓ – 2 పర్యవేక్షించాల్సి ఉంటుంది.
- నాడు – నేడు.. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. లెర్నింగ్ మెటీరియల్ టు స్టూడెంట్స్, మధ్యాహ్న భోజన నిధులు.. పారిశుధ్యం.. ప్రభుత్వ పథకాలు.. పాఠశాలల భద్రతతో పాటు అధికారులు కేటాయించిన ఇతర విధులను వీరు నిర్వర్తించాలి.

పర్యవేక్షణ పెరుగుతుంది



ఎంఈఓ – 1, 2కు విధుల కేటాయింపుతో పాఠశాలలపై పర్యవేక్షణ పెరుగుతుంది. అకడమిక్, పాఠశాలల నిర్వహణను ఇద్దరు ఎంఈఓలు పర్యవేక్షించనున్నారు. వీరికి విధుల కేటాయింపుతో విద్యార్థుల ఫలితాలు ఆశించిన స్థాయిలో వస్తాయి. ఎంఈఓలు ఆయా మండలాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించి అకడమిక్ క్యాలెండర్, ప్రభుత్వ పథకాలు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి.

– గంగాభవాని, డీఈఓ

సమస్యల పరిష్కారమే లక్ష్యం



అర్జీని స్వీకరిస్తున్న హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్
- కందుకూరులో 'జగనన్నకు చెబుదాం'

కందుకూరు: అర్జీదారులు సంతృప్తి చెందేలా.. క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహిస్తున్నామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఫిర్యాదులను నిర్ణీత కాల వ్యవధిలోపు పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల కేంద్రాల్లో ప్రతి బుధ, శుక్రవారాల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా కేంద్రానికి రాలేని గ్రామాల ప్రజల సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని తెలిపారు. సమస్యను పరిష్కరించాక సీఎం కార్యాలయాధికారులు అర్జీదారుడితో నేరుగా మాట్లాడి, సంతృప్తి చెందారో లేదో తెలుసుకుంటారని చెప్పారు. రెవెన్యూ, సర్వే, వారసత్వ భూముల మ్యుటేషన్లు, మున్సిపాలిటీలో మౌలిక వసతులు కల్పన, తదితరాలపై 120 అర్జీలు అందాయని తెలిపారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, సబ్ కలెక్టర్ శోభిక, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, జిల్లా సర్వే అధికారి హనుమంతప్రసాద్, డ్వామా పీడీ వెంకట్రావ్, నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి, డీఈఓ గంగాభవాని, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా సంక్షేమ పథకాలు

- నేటి నుంచి 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు సిటీ: రాష్ట్ర చరిత్రలో ఇంత భారీ స్థాయిలో సంక్షేమ పథకాలను అమలు చేసింది తమ ప్రభుత్వమేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నుంచి నిర్వహించనున్నామని వెల్లడించారు. నెలన్నర పాటు కార్యక్రమం కొనసాగనుందని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. జీఎస్డీపీ వృద్ధి రేటులో 2019లో 22వ స్థానంలో ఉండేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2021 – 22 ఆర్బీఐ రిపోర్ట్ ప్రకారం ప్రథమ స్థానంలో ఉందని చెప్పారు. తలసరి ఆదాయంలో చంద్రబాబు ప్రభుత్వంలో దేశంలో 17వ స్థానంలో ఉండగా, ఇప్పుడు మొదటి పది స్థానాల్లో ఉందని చెప్పారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో 34,108 ప్రభుత్వోద్యోగాలను కల్పించారని, తమ ప్రభుత్వం ఏర్పడ్డాక 4.93 లక్షల మందికి కల్పించామని వెల్లడించారు. ఇలా ప్రతి రంగంలోనూ ఎంతో అభివృద్ధి సాధించామని పేర్కొన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా సచివాలయ పరిధిలో ఇంటింటికీ గురువారం నుంచి వెళ్లి లబ్ధిదారులకు ఏయే పథకాలు అందాయి.. ఎంత పొందారనే సమాచారాన్ని గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సేకరించనున్నారని చెప్పారు. నిర్దేశిత ప్రాంతాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించడం.. పార్టీ అధికారంలో లేని సమయంలో కష్టపడిన కుటుంబాలను గుర్తించి పరామర్శించి, అండదండగా నిలుస్తామని తెలిపారు. పార్టీ మద్దతుదారులు, పెద్దలను కలిసి మాట్లాడతామన్నారు. ఇంటింటికీ కరపత్రాలు, క్యాప్‌లు, పార్టీ మద్దతుదారుల ఇళ్లపై జెండాలను ఎగురవేయాలని తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో స్థానిక నేతలు మాత్రమే పాల్గొనాలని.. ప్రభుత్వ కార్యక్రమాల్లో మాత్రమే అధికారులు పాల్గొంటారని తెలిపారు. తొలుత కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లు, జెండాలను ఆవిష్కరించారు. రాజ్యసభ సభ్యుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేయర్ పొట్లూరి స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, పార్టీ జిల్లా మహిళాధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసత్యాలతో రాక్షసానందం

- జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై అబద్ధపు రాతలు
- కూలిన ఇళ్లు అంటూ ఎల్లో మీడియాలో దుష్ప్రచారం
- వర్షానికి తడిసి వాలిన ఆరు ఇళ్ల పిట్ట గోడలు



నిర్మించిన వెంటనే వర్షం పడటంతో సిమెంట్ గట్టి పడక నెర్రె ఇచ్చిన గోడ

కావలి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ పనుల్లో నాణ్యతకు పెద్ద పీట వేసి నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. అయితే ఈ ఇళ్లు కూలిపోతున్నాయంటూ ఎల్లో మీడియాలో అసత్యాలను ప్రచారం చేసి రాక్షసానందం పొందుతున్నారు.

ఇదీ వాస్తవం..

కావలి పట్టణంలోని ముసునూరులో గల జగనన్న లేఅవుట్‌లో 4,150 గృహాలు నిర్మాణంలో ఉన్నాయి. ప్రస్తుతం పచ్చిగా ఉన్న సిమెంట్, ఇసుక వర్షం కారణంగా ఆరలేదు. దీంతో ఇటుకల నుంచి కారిపోయింది. ఈ క్రమంలో నిర్మాణంలో ఉన్న ఆరు ఇళ్ల పిట్ట గోడలు కదిలాయి. వీటిని కొందరు ఆకతాయిలు చేత్తో తోసేశారు. దీంతో కూలిన జగనన్న ఇళ్లు అంటూ ఎల్లో మీడియా దుష్ప్రచారం చేసి రాక్షసానందం పొందుతోంది. అపోహలు సృష్టించాలనే ఉద్దేశంతో విష ప్రచారం చేస్తున్నా లబ్ధిదారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. వర్షాలు పడుతున్నా, కొందరు లబ్ధిదారులు తమ ఇళ్లను నిర్మించుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు. కాగా ధనమ్మ అనే లబ్ధిదారు జగనన్న లేఅవుట్‌కు వచ్చి నిర్మాణంలో ఉన్న తన ఇంటిని పరిశీలించారు. తన ఇంటి గోడలు కూలిపోలేదని, ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని చేస్తున్న కుట్రలని కొట్టిపారేశారు. ఈ విషయమై విచారణ జరుపుతున్నామని కావలి గృహ నిర్మాణ శాఖ ఈఈ రంగవరపు ప్రసాద్ తెలిపారు.



జోరుగా నిర్మాణాలు

ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి నెట్ బాల్ టోర్నీ నేడు

ఆత్మకూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ అండర్ – 17 పోటీలను గురువారం నిర్వహించనున్నామని ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి విజయ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి తిరుపతయ్య బుధవారం తెలిపారు. అండర్ – 17 బాలబాలికలకు నిర్వహించనున్న టోర్నీకి రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 320 మంది క్రీడాకారులు, 60 మంది కోచ్‌లు, మేనేజర్లు హాజరుకానున్నారని వివరించారు. ఉత్తమ ప్రదర్శన చూపిన వారిని జాతీయ స్థాయికి ఎంపిక చేయనున్నారన్నారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సహకారంతో నిర్వహించనున్న పోటీలను జయప్రదం చేయాలని కోరారు.

విస్తృతంగా ఉపాధి

- లక్ష్యానికి చేరువలో పనులు
- కూలీలకు పేమెంట్ల రూపంలో రూ.276 కోట్లు
- రోజు వారీ కూలి రూ.272

గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఉపాధి పనులు అండగా నిలుస్తున్నాయి. జిల్లాలో లక్ష మందికి పైగా జాబ్ కార్డులు కలిగిన కూలీలు ఉపాధి పనులకు నిత్యం హాజరయ్యేలా అధికారులు చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో 1.13 కోట్ల పనిదినాల లక్ష్యానికి గానూ ఇప్పటి వరకు 1.06 కోట్ల మేర పనిదినాలను కూలీలకు కల్పించారు.



సంగం మండలం తరుణవాయిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

లక్ష్యం (పనిదినాల్లో): 1.13 కోట్లు	
ఇప్పటి వరకు పూర్తి చేసింది: 1.06 కోట్లు	జిల్లాలో జాబ్ కార్డు కలిగిన కూలీలు: 4.5 లక్షల మంది

నెల్లూరు (పొగతోట): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి పనులను విస్తృతంగా కల్పిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పనిదినాల లక్ష్యాన్ని సాధించేందుకు.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఒక్కో కుటుంబానికి 100 రోజుల పనిదినాలను కల్పించాలనే లక్ష్యంతో అధికారులు ముందుకెళ్తున్నారు.

చెల్లింపులు ఇలా..

ఉపాధి కూలీలకు పేమెంట్ల రూపంలో రూ.276 కోట్లు చెల్లించారు. వాస్తవానికి ఉపాధి పనులకు హాజరయ్యే వారికి రోజుకు రూ.272 చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతానికి రూ.252 మేర అందిస్తున్న కూలిని రానున్న రోజుల్లో రూ.272కు పెంచేలా డ్వామా అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. ఉపాధి పనుల నిమిత్తం మెటీరియల్ కాంపొనెంట్ ద్వారా రూ.148 కోట్లను అభివృద్ధి పనులకు వెచ్చించారు.

పనులతో కోలాహలం

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం అభివృద్ధి చెందేలా ఉపాధి పనులు చేపడుతున్నారు. దీని ద్వారా చెరువుల్లో మట్టి తీయడం.. కాలువలు తవ్వడం.. మొక్కలు నాటడం.. తదితర పనులు చేపడుతున్నారు. పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేస్తున్నారు. ఉదయం పది వరకు పనులకు హాజరైన కొంత మంది కూలీలు భోజనం చేసి ఇతర పనులకెళ్తున్నారు. పనులు పూర్తయిన అనంతరం కొలతలను ఉపాధి హామీ సిబ్బంది సేకరించి ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఉపాధి కూలీలకు వేతనాలను వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తున్నారు. మర్రిపాడు, ఉదయగిరి, వింజమూరు, సీతారామపురం, రాపూరు, కలువాయి, బోగోలు, దగదర్తి, జలదంకి, సంగం, చేజర్ల తదితర మండలాల్లో ఉపాధి పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు.

గతేడాది 1.15 కోట్ల పనిదినాలు

గత ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 1.15 కోట్ల పనిదినాలను కల్పించి.. కూలీలకు సుమారు రూ.290 కోట్లు చెల్లించారు. రూ.200 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. అదే విధంగా కరోనా మహమ్మారి కాలంలో పనుల్లేక కూలీలు నానా అవస్థ పడిన సమయంలోనూ 1.48 కోట్ల పనిదినాలను కల్పించారు. పేమెంట్ల రూపంలో సుమారు రూ.350 కోట్లను చెల్లించారు.

నూరు శాతం లక్ష్యం సాధిస్తాం



గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందేలా ఉపాధి పనులను చేపట్టాం. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో 1.13 కోట్ల పనిదినాల లక్ష్యానికి గానూ ఇప్పటి వరకు 1.06 కోట్ల మేర కల్పించాం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని వంద శాతం సాధించేలా చర్యలు చేపట్టాం.

– వెంకట్రావ్, డ్వామా పీడీ

క్రీడారంగానికి మరింత ప్రోత్సాహం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- కేజీఆర్ వాలీబాల్ టోర్నీ ప్రారంభం


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి చిత్రంలో ఎంపీలు వేమిరెడ్డి, గురుమూర్తి, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

ముత్తుకూరు : క్రీడారంగానికి, క్రీడాకారులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తోందని రాష్ట్ర వ్యవసాయ–మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ముత్తుకూరులోని ఈఆర్‌ఆర్‌ఎం క్లబ్‌లో తలపెట్టిన 'కేజీఆర్ వాలీబాల్ కప్ –2023 టోర్నమెంట్'ను మంత్రి కాకాణి బుధవారం రాత్రి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో ఎవరూ చేయని విధంగా వచ్చే మాసంలో సీఎం వైఎస్ జగన్ 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం నిర్వహిస్తున్నారని వెల్లడించారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడల పోటీలు నిర్వహించి, క్రీడాస్ఫూర్తి నింపి, ప్రతిభను వెలికి తీయాలన్న ధ్యేయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. కాగా ఈ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ముత్తుకూరు ఎస్సై శివకృష్ణారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధనరెడ్డిలను మంత్రి అభినందించారు. టోర్నమెంట్‌కి సహకారం అందించిన కృష్ణపట్నంపోర్టు అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, పీఆర్వో వేణుగోపాల్‌తో పాటు పి.హేమంత్‌కుమార్‌రెడ్డి, అల్తూరు గిరీష్‌రెడ్డి, దీపక్‌రెడ్డిలను ప్రశంసించారు.

గెలుపు ఓటములు సమానం

క్రీడల్లో గెలుపు–ఓటములను సమానంగా స్వీకరించాలని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. క్రీడా పోటీలు ఆరోగ్యకరంగా జరగాలని తిరుపతి పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ గురుమూర్తి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భారీ ఎత్తున క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషకరమని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులను అతిథులు పరిచయం చేసుకుని, పోటీలను ప్రారంభించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. టీడీపీ నేత షేక్ యస్దానీ, వారి మిత్రబృందం దాదాపు 300 మంది నగరంలోని ఇస్కాన్ సిటీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ 42వ డివిజన్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌మస్తాన్ ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం, చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో ఏనాడైనా టీడీపీ కార్యకర్తలను నారాయణ పట్టించుకున్నారా.. అని ప్రశ్నించారు. 2021లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు వెన్నుపోటు పొడిచిన ఘనత నారాయణది అని తెలిపారు. టీడీపీలో నారాయణ కింద పని చేసేందుకు కొందరు మాత్రం ప్యాకేజీ కోసం ఉన్నారని, లేనిపక్షంలో ఎవరూ ఆయన కింద పనిచేసేందుకు సిద్ధంగా లేరన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటికైనా ఆలోచించాల్సిన పరిస్థితి ఉందన్నారు. పార్టీలో చేరిన వారిలో షబ్బీర్, ఖలీల్, మాబాషా, రిజ్వా, ఇస్మాయిల్, రఫీ, షఫీ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ షేక్.కరిముల్లా, వైఎస్సార్‌సీపీ నేత అబ్దుల్ మస్తాన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు ఏడు ప్రాజెక్టులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు

నెల్లూరు (టౌన్) : రాష్ట్రస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలకు జిల్లా నుంచి ఏడు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. నగరంలోని సంతపేటలో ఉన్న బీఈడీ కళాశాలలో 31వ జిల్లా స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలను బుధవారం నిర్వహించారు. ఇందులో మొత్తం 48 సైన్స్ ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. వాటిల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏడు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలకు ఎంపిక చేశారు. న్యాయ నిర్ణేతలుగా విక్రమ సింహపురి యూనివర్సిటీ ప్రొఫెసర్లు వ్యవహరించారు. విజేతలకు జ్ఞాపికలతో పాటు బాల శాస్త్రవేత్త గైడ్ టీచర్‌కు రూ.500 అందజేశారు. ఈనెల 29, 30వ తేదీల్లో జరుగనున్న రాష్ట్రస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో ఏడు ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, పాఠశాల విద్యాశాఖ, శ్రీకే దాస్ అకాడమీ కందుకూరు సమన్వయంతో జరిగింది. సమన్వయకర్తగా జేవీ రమేష్ వ్యవహరించగా, బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, మారుతీకేశవ్‌కుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన ప్రాజెక్టులు ఇవే..

- హోమ్ మేడ్ పెస్టిసైడ్ ఫర్ గార్డెన్, జెడ్పీహెచ్ఎస్. సోమవరప్పాడు, జలదంకి మండలం. (గ్రూపు లీడర్ సంయుక్త)
- లాంటనా నావెల్ వెపన్ హైపోథిసెస్, మోడల్ స్కూల్, సంతపేట, (గ్రూపు లీడర్ అనూషా)
- ట్రెడిషనల్ బయోలాజికల్ స్ట్రాటజీస్, రత్నం స్కూల్, నెల్లూరు, (గ్రూపు లీడర్ ఆదర్శ)
- టెస్టింగ్ ది ఎఫికసీ ఆఫ్ ది రీసైకిల్డ్ పేపర్ విత్ నేచురల్ యాడిటివ్స్ టు కీప్ అప్ ది ఎండీఎం మెటీరియల్ ఇన్ అవర్ స్కూల్, జెడ్పీహెచ్ఎస్, కట్టుబడిపాళెం (చెన్నూరు) (గ్రూపు లీడర్ శ్రీవర్షిత)
- ఫ్లోరైడ్ వాటర్ ఇట్స్ ఎఫెక్ట్ అండ్ ఇట్స్ సొల్యూషన్స్, ఏపీ మోడల్ స్కూల్, చుండి, (గ్రూపు లీడర్ హత్విక సాయికోటి)
- వాటర్ ప్యూరిఫికేషన్ అండ్ డిజినిఫికేషన్ బై యూజింగ్ సోలార్ ఎనర్జీ, మినర్వ స్కూల్, కావలి. (గ్రూపు లీడర్ అక్షయ్)
- ఎకో ఫ్రెండ్లీ బ్యాగ్ మేకింగ్ బై రా కోకోనట్ ఫైబర్, ఐబీఆర్ఎం హైస్కూల్, సీపీ పాలెం. (గ్రూపు లీడర్ నందిని)

కండలేరులో 11.297 టీఎంసీలు

రాపూరు : కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 11.297 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 40 క్యూసెక్కులు, పిన్నెరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్: రూ.109
లేయర్ రూ.105
బ్రాయిలర్ చికెన్: రూ.196
స్కిన్‌లెస్ చికెన్: రూ.216
లేయర్ చికెన్ : రూ.178


పెన్నాలో గుర్తుతెలియని మృతదేహం


మృతుడు

నెల్లూరు(క్రైమ్) : నెల్లూరు బోడిగాడితోట శ్మశానవాటిక వెనుక వైపు పెన్నానదిలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో నదిలో నుంచి మృతదేహాన్ని వెలికితీయించారు. మృతుడు 30 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి పసుపు రంగు టీషర్టు ధరించి ఉన్నాడు. మృతుని ఎడమ చేతి కింద, కుడి కాలు తొడపై పుట్టు మచ్చలున్నాయి. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుని వివరాలు తెలిసిన వారు 94407 96306, 94407 96310కు సమాచారం అందించాలని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ ఎం.బాబి విజ్ఞప్తి చేశారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.50
సన్నవి : రూ.20
పండ్లు : రూ.6



'రంగడి' హుండీ కానుకల లెక్కింపు


హుండీ కానుకలు లెక్కింపు సిబ్బంది

నెల్లూరు(బృందావనం) : నగరంలోని రంగనాయకుల పేటలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపు బుధవారం జరిగింది. దేవస్థానం ఈఓ ఉష తెలిపిన మేరకు.. ఈ ఏడాది జూలై 6 నుంచి నవంబర్ 8వ తేదీ వరకు భక్తులు కానుకల రూపంలో రూ.11,27,281 సమర్పించారన్నారు. ఈ కానుకల లెక్కింపు పర్యవేక్షణాధికారిగా దేవదాయ, ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్ వ్యవహరించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యురాలు మిరియాల శివకామిని, వివిధ ప్రభుత్వశాఖల విశ్రాంత సిబ్బంది, పోలీసు, రెవెన్యూ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రక్తదానంలో అజయ్‌బాబు సెంచరీ


రక్తదానం చేస్తున్న అజయ్‌బాబు

మనుబోలు/నెల్లూరు సిటీ : ప్రభుత్వ ఉపాధ్యాయుడు అజయ్‌బాబు బుధవారం నెల్లూరు రెడ్‌క్రాస్‌లో వందో సారి రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. మనుబోలు మండలంలోని కొమ్మలపూడి గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో అజయ్‌బాబు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఎవరికైనా ఆపద వచ్చి రక్తం అవసరమైతే రక్తదానం చేయడం అలవాటుగా మార్చుకున్నాడు. నెల్లూరు మెడికవర్ ఆస్పత్రిలో అత్యవసరంగా ఓ వ్యక్తికి రక్తం అవసరం కావడంతో 100వ సారి చేశాడు. ఈ సందర్భంగా అజయ్‌బాబును ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు. అనంతరం అజయ్‌బాబు మాట్లాడుతూ ప్రాణం ఉన్నంత వరకూ రక్తదానం చేస్తూ ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తానని తెలిపారు.



ఆపరేషన్ బ్యూటీ

పెళ్లి సంబంధాల్లో 'కొత్త' డిమాండ్

పెళ్లి సంబంధం కుదరగానే వారి వారి స్థోమత మేరకు పెళ్లి ఎంత గ్రాండ్‌గా చేయాలనే ఆలోచన చేస్తుంటారు పెద్దవాళ్లు. పెళ్లిలో కాబోయే అత్తగారి డిమాండ్ మేరకు వధువు అమ్మానాన్నలు నడుచుకుంటూ ఉంటారు. ఇందులో భాగంగా ఇటీవల మరో కొత్త డిమాండ్ కూడా వచ్చి చేరింది. కాబోయే పెళ్లికూతురు వివాహ వేడుకలో దేదీప్యమానంగా వెలిగిపోవాలి. అందరూ 'అందమైన కోడలిని సెలెక్ట్ చేసుకున్నారు అనే కితాబులు అందుకోవాలి. అందుకు, ఏ చికిత్స చేయించుకున్నా సరే!' అంటున్నారు. మరి, కాబోయే వధువులు వేడుకకు సిద్ధం కావడానికి ఎలాంటి కేర్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో అందం పట్ల తీసుకుంటున్న చికిత్సలు.. వికటిస్తున్న పరిమాణాలు ఏమిటి? భేష్ అనదగిన విధానాలేమిటి? అనే విషయాలపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి.

''ఓ మల్టీనేషనల్ కంపెనీలో పనిచేస్తున్న సుష్మ పెళ్లి వచ్చే డిసెంబర్‌లో జరగనుంది. పెళ్లి ఫిక్స్ అయ్యాక అత్తగారు నవ్వుతూ – 'అమ్మాయీ, నీ వంటి రంగు బ్రైట్ చేయించుకో. ఫెయిర్ నెస్ కోసం ఇంజెక్షన్లు మార్కెట్‌లో దొరుకుతాయని విన్నాను. వాటిని ట్రై చేయి. ఏ ట్రీట్‌మెంట్ అయినా తీసుకో. కానీ, పెళ్లి టైమ్‌కి అందంగా తయారవ్వాలి' అని ఆర్డర్ వేసింది. ఆమె తన కోడలు పందిట్లో చందమామలా కనిపించాలని, కోడలు మొహం చూసి బంధుమిత్రులంతా నిశ్చేష్టులవ్వాలని కోరుకుంటుంది. 'అత్తగారి డిమాండ్ ఇప్పుడు నాకు ఆందోళన కలిగిస్తోంది' అంటోంది సుష్మ. ఇందుకోసం బ్యూటీ ట్రీట్‌మెంట్స్‌తో పాటు చర్మ ఛాయలో కూడా తేడా వచ్చేలా మార్పులు చేసుకోవడానికి తెగ కష్టపడుతోంది. 'పెళ్లి అంటేనే ఎంతో ఉత్సాహం. ఫొటోల్లో, వీడియోల్లో బాగా కనిపించాలని, అందరిలో ప్రత్యేకంగా వెలిగిపోవాలని నాకూ ఉంటుంది. ఇందుకు బ్యూటీ పార్లర్స్‌కి వెళ్లడం, మేకప్ చేయించుకోవడం సాధారణంగా జరుగుతుంటుంది. కానీ, ఇప్పుడు ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్స్ కూడా చేయించుకోవాల్సి వస్తోంది. పెళ్లి ఖర్చులే కాకుండా ఈ కొత్త తరహా ఖరీదైన ఖర్చు తలనొప్పిగా మారింది అంటున్నారు అమ్మానాన్నలు' అని బాధపడుతోంది సుష్మ.

★ ★ ★

కాబోయే అత్తగారు కోరడంతో రూప (పేరు మార్చడమైంది) తన కంటి కింది భాగం లోతుగా ఉండటం వల్ల 'అండర్ ఐ ఫిల్లర్' ఇంజక్షన్ చేయించుకుంది. దీంతో కంటి కింది భాగంలో రక్తం గడ్డకట్టి, వాపు వచ్చి, బయటకు రాలేని పరిస్థితి. త్వరలో పెళ్లి. ఆ క్లాట్ అంత తొందరగా తగ్గదు. దిక్కుతోచని పరిస్థితి.

★ ★ ★

శిల్ప అందం కోసం బొటాక్స్ ట్రీట్‌మెంట్ చేయించుకుంది. డోస్ ఎక్కువ మోతాదులో ఇవ్వడం వల్ల ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడానికి వీలు లేకుండా మారిపోయింది.

★ ★ ★

అందం పెంచుకునే విషయంలో ఒకరో ఇద్దరు కాదు అమ్మాయిలు ఎప్పుడూ తమ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇక పెళ్లి అంటే చెప్ప నక్కర్లేదు. ప్రీ వెడ్డింగ్ షూట్ నుంచి ప్రతి సంబరాన్నీ పదిలపరుచుకోవడానికి ఎన్నో పాట్లు పడతారు. దీంట్లో భాగంగా బ్యూటీ కాన్షియస్ అమ్మాయిల్లోనూ, అబ్బాయిల్లోనూ పెరిగింది. ఈ విషయంలో ఎలాంటి చికిత్స, జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవడం మంచిది అంటున్నారు డెర్మటాలజిస్ట్ డాక్టర్ స్వప్న ప్రియ. వాటిలో...

ఇంట్లో ప్రయోగాలు..

చాలా మంది అందానికి ఇంటి చిట్కాలు పాటిస్తుంటారు. సహజంగా లభించే వాటితో బ్యూటీప్యాక్‌లు వేసుకుంటూ ఉంటారు. వాటి ద్వారా ఎంత సమయంలో ఎంత ప్రయోజనం ఉంటుందో కూడా చూడాలి. ఎందుకంటే, కొంతమందికి స్కార్స్, పింపుల్స్, యాక్నె, డల్ స్కిన్, కలర్ ఛేంజ్, చుండ్రు... ఇలా చాలా సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. వాటికి చికిత్సనే సరైన మార్గం. ఆహారానికి సంబంధించినవి తప్పనిసరిగా పెళ్లికి రెండు నుంచి మూడు నెలల ముందు మార్పులు చేసుకోవాలి. సహజంగా చర్మంలో మార్పులు రావాలంటే పోషకాహారం మంచి ఎంపిక. అప్పుడే మంచి ఫలితం ఉంటుంది.

బ్యూటీ స్పాలో చికిత్స మంచిదేనా?

స్కిన్ టైటనింగ్, రింకిల్స్, స్కిన్ హైడ్రేషన్.. వంటి ట్రీట్‌మెంట్స్ బ్యూటీ స్పాలలో చేయించుకుంటారు. దీనికి కూడా ముందు సరైన కౌన్సెలింగ్ అవసరం. ఒక్కో వ్యక్తి చర్మ తత్వం ఒక్కో విధంగా ఉంటుంది. ఈ విధానంలో చర్మం రికవరీ అవడానికి కూడా సమయం పడుతుంది.

ఇంజక్షన్లు సరైనవేనా...

కృత్రిమంగా కొలాజన్, స్కిన్ బూస్టర్స్.. అని తీసుకుంటున్నారు. ఎవరో చెప్పారని కొంతమంది నర్సులను ఇంటికి పిలిపించుకొని ఇంజక్షన్లు చేయించుకుంటారు. మంచి లుక్ కోసం ట్రై చేయచ్చు. కానీ, వాటి డోసుల్లో తేడాలొస్తే మొత్తం తిరగబడుతుంది.

ఆన్‌లైన్‌లో చూసి ...

సోషల్ మీడియా ప్రభావం వల్ల ఆన్‌లైన్‌లో బ్యూటీ ఉత్పత్తులు తెప్పించుకొని, అప్లై చేసుకోవడం చూస్తుంటాం. వాటి వల్ల ఇబ్బందుల పాలైన వారు చాలా మంది ఉంటారు. ఎందుకంటే, అవి వారికి ఎంత వరకు నప్పుతాయో తెలియదు.

కెమికల్ పీలింగ్

కెమికల్ పీల్‌లో బయటి నుంచి చర్మంలోకి ఎలాంటి రసాయనాలు చొప్పించరు. మృతకణాలను తొలగిస్తారు, చర్మం పై పొర నుండి టానింగ్, పిగ్మెంటేషన్ తగ్గి కొత్త పొర కనిపిస్తుంది. అయితే, దీని ద్వారా చర్మంపై కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నిపుణుల సలహా అవసరం. ఇంకొన్ని పీఆర్‌పీ చికిత్సలు చర్మ నిగారింపును తీసుకువస్తాయి. అయితే, వధువులు కాబోయే అమ్మాయిలు పెళ్లికి 3 నుండి 6 నెలల ముందు ఈ కాస్మెటిక్ విధానాలను ప్రారంభించాలి. ఎందుకంటే వారి సిట్టింగ్‌లలో కనీసం 3 వారాల గ్యాప్ ఉండాలి.

లైటర్ టోన్‌లకు డిమాండ్

పెళ్లి చేసుకోబోయే అమ్మాయిలు తమ ప్రీ-బ్రైడల్ విధానంలో రంగు ఫెయిర్‌గా మారడం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిజానికి, సూర్యకిరణాల నుండి మన చర్మాన్ని మనం రక్షించుకోనప్పుడు, చర్మంలో పాచెస్ ఏర్పడతాయి. కొన్నిసార్లు సూర్యకాంతి కుడి వైపున, మరి కొన్నిసార్లు ఎడమ వైపున ఎక్కువగా పడుతుంది. సూర్యుని అతినీలలోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీస్తాయి. పిగ్మెంటేషన్‌ను ప్రేరేపిస్తాయి. దీంతో అంతటా 'చర్మపు రంగు' ఒకే విధంగా ఉండదు. అంటే ముఖం మీద చాలా చోట్ల టాన్ ఉంటుంది. ఈవెన్ టోన్‌ని కలిగి ఉండాలంటే ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ముఖంపై సన్‌స్క్రీన్‌ని అప్లై చేయడం చాలా ముఖ్యం.

కాస్మొటిక్ ఫిల్లర్స్...

నిఖిత పెదవులు చాలా సన్నగా ఉంటాయి. రంగు చాలా తక్కువ. ఒకరోజు ఆమె కాబోయే అత్తగారు ఫోన్ చేసి 'నీ ముఖంలో పెదవులు కనిపించడం లేదు. ఏదైనా చికిత్స తీసుకో' అంది. దీంతో నిఖిత నర్సులను కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లను ఆశ్రయించింది. దీనిని లిప్ ఫిల్లర్ అని కూడా అంటారు. దీర్ఘకాలిక ఫలితాల కోసం, ప్రతి 6 నుండి 8 నెలలకు ఇంజెక్షన్లు చేయాలి. కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లే కాకుండా, హైలురానిక్ యాసిడ్ ఫిల్లర్ ఇంజక్షన్లు కూడా ఈ రోజుల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ డెర్మా ఫిల్లర్‌లతో పెదవులు హైడ్రేటెడ్‌గా ఉంటాయి. పగుళ్లు రావు. పూర్తి పరిమాణంలో కనిపిస్తాయి. అలాగే, కొందరు అమ్మాయిలు అత్తింటి వారు బరువు తగ్గమన్నారు కదా అని లైపోసక్షన్ వంటి చికిత్సలు చేయించుకుంటారు. దీని వల్ల చర్మంపై చారలు ఏర్పడతాయి. అవి అంత త్వరగా పోవు. ముక్కు, పెదాలు, బ్రెస్ట్ సరిచేసుకోవడానికి కాస్మొటిక్ సర్జరీలు కూడా చేయించుకుంటారు. ఏ చికిత్స అయినా కనీసం ఆరు నెలల ముందు చేయించుకుంటే వచ్చే సైడ్‌ఎఫెక్ట్‌నూ నివారించవచ్చు.

సహజమైన మెరుపే మేలు



డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

పెళ్లి 10–15 రోజులు ఉందనగా ఏ బ్యూటీ ట్రీట్‌మెంట్ చేయించుకోకూడదనే విషయం ముందు గ్రహించాలి. కనీసం ఆరు లేదా మూడు నెలల ముందు బ్యూటీ చికిత్సలు చేయించుకోవచ్చు. దీని ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటే నివారించుకునే అవకాశం ఉంటుంది. కృత్రిమ అందాన్ని ఎవరూ ఇష్టపడరు. ఎప్పుడైనా సహజమైన మెరుపును ఇచ్చే బ్యూటీ ట్రీట్‌మెంట్ మాత్రమే మంచిదని గమనించాలి. అయినా తప్పదు అనుకునేవారు స్కిన్ బూస్టర్స్, ఇతర ట్రీట్‌మెంట్ వైపుగా వెళ్లచ్చు. ఇందుకు నిపుణుల పర్యవేక్షణ అవసరం.

టిప్



డ్రై ఫ్రూట్స్ గిఫ్ట్ ఇస్తున్నారా?

దీపావళికి డ్రైఫ్రూట్స్‌ను గిఫ్ట్‌గా ఇస్తుంటారు చాలామంది. అయితే డ్రైఫ్రూట్స్‌ను కొనేటప్పుడు కచ్చితంగా ఇవి గమనించుకోవాలి. ● నట్స్ రంగు ఎలా ఉందో చూడాలి. సహజంగా ఉండాల్సిన దానికంటే మరింత ముదురు రంగులో ఉంటే అవి పాడైనట్లు. రుచిగా కూడా ఉండవు కాబట్టి కొనకపోవడమే మంచిది. ● వీలైతే ఒకటి రెండు నట్స్‌ను నీటిలో వేసి, పదినిమిషాల తరువాత కొరికి చూడాలి. నానిన తరువాత కూడా గట్టిగా ఉంటే అవి చాలా పాతవి. ఇవి ఆరోగ్యానికి అంత మంచిది కాదు కాబట్టి తీసుకోకూడదు. చాలా షాపులు తిన డానికి శాంపిల్స్ ఇవ్వవు. ఇలాంటప్పుడు ఆ డ్రైఫ్రూట్స్‌ను తక్కువ పరిమాణంలో కొనుక్కుని పరిశీలించాలి ● నట్స్‌ని వాసన చూడాలి. ఘాటైన వాసన వస్తే అవి చాలా పాతవి. వీటికి కొద్దిగా తేమ తగిలితే వెంటనే బూజు పట్టి త్వరగా పాడవుతాయి. ఇవి తినడం ఆరోగ్యానికి మంచిది కాదు ● నట్స్ ప్యాకెట్ మీద ఎఫ్ఎస్ఎస్ఏఐ ముద్ర, నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో చూడాలి. ఎప్పుడు ప్యాకింగ్ అయ్యింది? ఎప్పటిలోగా తినాలో సూచించే డేట్స్‌ను సరిగా చూసుకోవాలి. ఈ డేట్స్ ముద్రించని ప్యాకెట్స్‌ను కొనకూడదు ● ప్యాకెట్ మీద ముద్రించిన సమాచారాన్ని జాగ్రత్తగా చదవాలి. ప్రిజర్వేటివ్‌లు కలిపిన నట్స్‌ను కొనకపోవడమే మంచిది.

దుర్గ ఇండియా



ప్రతి స్త్రీ దుర్గ వలే...

ప్రతి స్త్రీలో ఒక దుర్గ ఉంటుంది. కాని ఆ దుర్గను అదిమి పెట్టేలా కుటుంబం, సమాజం ఆమెను తీర్చి దిద్దుతాయి. దాంతో తన మీద ఏ అన్యాయం జరిగినా చెప్పలేని స్థితికి చేరుతుంది. 'నువ్వు దుర్గవి. పోరాడు' అని చెప్తారు బెంగళూరులోని 'దుర్గ ఇండియా' టీమ్ సభ్యులు. ప్రియా వరదరాజన్ అనే యాక్టివిస్ట్ ఏర్పాటు చేసిన ఈ గ్రూప్ స్త్రీలను కుటుంబ హింస నుంచి... లైంగిక వేధింపుల నుంచి కాపాడటానికి పని చేస్తోంది. వారి పోరాటానికి శక్తినిస్తోంది.

'ప్రతి ఒక్కరూ మార్పు కోసం ఎదురు చూస్తారు. మనమే మార్పు కోసం ప్రయత్నిద్దామని ఎందుకు అనుకోరు... ఎదురు చూస్తూ కూచుంటే మార్పు వస్తుందా?' అంటారు ప్రియా వరదరాజన్.

బెంగళూరులో 'దుర్గ ఇండియా' అనే సంస్థ స్థాపించి స్త్రీల సమస్యలపై పని చేస్తున్న ప్రియ ఇటీవల బెంగళూరు మాల్‌లో ఒక వ్యక్తి స్త్రీలను అసభ్యంగా తాకడం గురించి ప్రస్తావిస్తూ 'పబ్లిక్ ప్లేసుల్లో– బహిరంగ ప్రదేశాల్లో గాని ఆన్‌లైన్‌లోగాని స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తే అలాంటి వారిపై చర్య తీసుకునేందుకు ఆ బాధిత మహిళకు అండగా నిలవడం మేము చేసే పని. చట్టాలు ఎన్ని ఉన్నా, పోలీసులు, మహిళా పోలీసులు ఎందరు ఉన్నా మహిళలకు సాటి మహిళ అండగా ఉంటే కలిగే ధైర్యం వేరు. తోటి మహిళలతో వారు చెప్పుకునేవి వేరు. అలాంటి వారికి యోగ్యులైన కౌన్సెలర్లతో కౌన్సెలింగ్ చేయించి దిలాసా ఇప్పిస్తాము. అంతే కాదు బాధితులను వెంటబెట్టుకొని– ఆ స్టేషన్‌కుపో ఈ స్టేషన్‌కు పో అనే బాధ లేకుండా బెంగళూరులో వన్ స్టాప్ సెంటర్స్‌లో ఫిర్యాదు చేయిస్తాము. తోడుగా మేమొస్తే బాధితులు ఫిర్యాదు చేయడానికి జంకరు. ఎటొచ్చీ వారికి తోడు నిలిచే స్త్రీల బృందాలు అన్నిచోట్లా ఉండాలి' అంటుంది ప్రియ.

ఐ యామ్ ఎవ్రి ఉమన్

పదేళ్ల క్రితం ప్రియా వరదరాజన్ 'ఐ యామ్ ఎవ్రి ఉమన్' పేరుతో ఒక బ్లాగ్ రాయడం మార్పు కోసం ఆమె వేసిన మొదటి అడుగు. ఆ బ్లాగ్‌కు క్రమంగా చాలామంది మహిళా ఫాలోయర్లు వచ్చారు. వారు తమ అనుభవాలను ప్రియతో పంచుకోసాగారు. 'అందరిదీ ఒకే కథ. అందరూ మరొక స్త్రీ లాంటి వారే అని నాకు అర్థమైంది. స్త్రీల కోసం పని చేయాల్సిన అవసరం తెలియజేసింది. స్త్రీల కోసం పని చేయడం అంటే వారి పట్ల భావజాలాన్ని మార్చడమే' అంటుంది ప్రియ.

మగాడు ఎందుకు అలా చేస్తాడు?

'గతంలో సమాజంలో స్త్రీలకు ఏదైనా సమస్య వచ్చి ఆమె బయటకు చెప్పినప్పుడు– ఆమెలో ఏ దోషం ఉందో అన్నట్టుగా నిందను ఆమె మీదే వేసేవారు ఉండేవారు. వారి భావజాలాన్ని మార్చడమే చేయవలసింది. స్త్రీకి ఏదైనా అన్యాయం జరిగినప్పుడు ఆ మగాడు ఆమెతో అలా ఎందుకు చేశాడు అని ఆలోచించేలా చేస్తే సగం మార్పు వచ్చినట్టే. ఇంట్లో, వీధిలో, ఆఫీసులో స్త్రీలు ఆత్మాభిమానంతో ఉండాలంటే మగాళ్లు మారాలి. అందుకు ఒక రోజు సరిపోదు. ఒకరు పని చేస్తే సరిపోదు. ప్రతి ఒక్కరం ఏదో ఒక మేరకు పని చేయాల్సిందే' అంటుంది ప్రియ.



అందరినీ 'దుర్గ'లుగా మారుస్తూ

అన్యాయం జరిగితే వెరవకుండా ప్రతిఘటించమని ప్రియ ఆధ్వర్యంలో 'దుర్గల' బృందం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్కూళ్లలో, కాలేజీలలో, బస్తీలలో తిరుగుతూ స్త్రీలకు తమ హక్కులను, చట్టపరమైన రక్షణను, సహాయం చేసే బృందాలను తెలుపుతుంది. 'నేను ఒంటరిదాన్ని కాను అని స్త్రీ అనుకుంటే చాలు... ఆమె పోరాడగలదు' అంటుంది ప్రియ.

ఇంత ప్రయత్నం చేసే ప్రియ లాంటి వారి సంఖ్య ఎంత పెరిగితే దుర్గలకు అంత శక్తి పెరుగుతుంది.

ఖుషీతో దిల్ ఖుష్



చిన్నతనంలో తాము పడ్డ కష్టాలు తమ పిల్లలు పడకూడదని వారికి నొప్పి తెలియకుండా ఎంతో కష్టపడి పెంచుతారు తల్లిదండ్రులు. అయితే లక్నోకు చెందిన ఖుషీ అందుకు భిన్నం. తన తండ్రిలా మరెవరూ కష్టపడకూడదని తానే ఓ సామాజిక కార్యకర్తగా మారి సాటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది ఖుషీ పాండే.

లక్నోకు చెందిన 23 ఏళ్ల ఖుషీ పాండే బాల్యం ఉన్నావ్ అనే ఊళ్లో గడిచింది. తన తండ్రి నుంచి చిన్ననాటి విషయాలను క్షుణ్ణంగా తెలుసుకుంది. ఖుషీ తండ్రికి బాగా చదువుకోవాలని ఉండేది. కానీ పెన్సిల్ కొనే స్థోమత కూడా లేదప్పుడు. ఈ విషయం తెలుసుకుని, నాన్నలా మరెవరూ చదువుకోసం ఇబ్బంది పడకూడదు అనుకుంది. నిరుపేదలకు సాయం చేయాలని చిన్నప్పుడే గట్టిగా నిర్ణయించుకుంది.

ఖుషీ పెద్దయ్యేసరికి నాన్న వాళ్ల లక్నోకి మకాం మార్చారు. అక్కడ ఓ షాపులో పనిచేస్తూ తరువాత కాంట్రాక్టర్‌గా మారారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రాజెక్టులు కూడా రావడంతో ఖుషీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. దీంతో ఖుషీ 'లా' పూర్తయ్యాక, సోషల్ వర్క్‌లో పీజీ చేసింది. చదువు పూర్తయ్యాక వెంటనే నిరుపేదలకు చదువు చెప్పడం ప్రారంభించింది. మురికివాడల్లోని పిల్లలను ఒక చెట్టుకింద కూర్చోబెట్టి సాయంత్రం రెండుమూడు గంటలు చదువు చెప్పేది. రోజుకి యాభై మంది వరకు ఖుషీ క్లాసులకు హాజరయ్యేవారు. తన దగ్గరకు వచ్చే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు, వారి తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరిస్తోంది.

తాతయ్య మరణంతో...

అది 2020 ... ఒకరోజు రాత్రి ఖుషీ వాళ్ల తాతయ్య షాపు నుంచి తిరిగి వస్తున్నారు. చీకట్లో సరిగా కనిపించక ఎదురుగా వచ్చే కారు తాతయ్య సైకిల్‌ని ఢీ కొట్టడంతో ఖుషీ తాతగారు అక్కడికక్కడే చనిపోయారు. తాతయ్యను ఎంతో ఇష్టపడే ఖుషీ ఈ చేదు సంఘటనను తట్టుకోలేకపోయింది. సైకిల్‌కు లైట్ ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదు అనుకుని ప్రతి సైకిల్‌కు లైటు ఉండాలని భావించింది. రోజూ కూలి పనిచేసుకునేవారు తమ సైకిళ్లకు లైట్లు పెట్టుకోవడానికి తగ్గ స్థోమత ఉండేది కాదు. దాంతో వాళ్లకు ఒక్కొక్కరికి 350 రూపాయల ఖరీదు చేసే లైట్లను ఉచితంగా పంచింది. ఇలా ఇప్పటిదాకా 1500 మంది వాహనాలకు బ్యాటరీతో నడిచే లైట్లను అమర్చింది. లైట్లు అమర్చడానికి 'ఇన్‌స్టాల్ లైట్స్ ఆన్ బైస్కిల్' అని రాసిన ఉన్న ప్లకార్డు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ ఎంతోమందికి అవగాహన కల్పించింది. అప్పట్లో ఖుషీ చేసిన ఈ పనిని ఓ ఐఏఎస్ అధికారి వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఈ విషయం తెలిసిన ఎనభైమంది యువకులు ఖుషీతో కలిసి సైకిళ్లు, ట్రక్కులకు, ఇతర వాహనాలకు లైట్లు అమర్చడంలో ఖుషీకి సాయంగా నిలిచారు.





పాఠాలతో పైసలు సంపాదించి...

ఖుషీ చేస్తోన్న సామాజిక కార్యక్రమాలకు నిధులు చాలా కావాలి. ఇందుకు తన తండ్రి, బంధువులు సమకూర్చిన మొత్తం ఏమాత్రం సరిపోలేదు. దాంతో యూట్యూబ్‌లో 'లా' తరగతులు చెప్పడంతోపాటు, ఇతర పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ నెలకు అరవై నుంచి డెబ్బై వేల వరకు సంపాదించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

మహిళలకు అండగా...

బాలికలకు శానిటరీ ప్యాడ్ ల గురించి అవగాహన కల్పించడం, విద్యుత్ సదుపాయం లేని వారికి సోలర్ ల్యాంప్స్ అందించడం, 'జీవిక సాథీ' ప్రాజెక్టు పేరుతో దివ్యాంగ మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలకు కుట్టు మిషన్, జ్యూవెలరీ తయారీలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేయడం వంటి సేవా కార్యక్రమాలతో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఫస్ట్ టైమ్

మంత్రముగ్ధులను చేసే దాస్తాంగోయి

'దాస్తాంగో ప్రదర్శన ఇస్తున్నది ఓ అమ్మాయా!!' అని బోలెడు ఆశ్చర్యపడుతూనే ప్రేక్షకుల మధ్య కూర్చున్నాడు ఒక ప్రేక్షకుడు. ఇలా కూర్చొని అలా వెళ్లిపోదాం... అనుకున్నాడు. అయితే ప్రదర్శన పూర్తయ్యే వరకు కదలకుండా కూర్చున్నాడు. ఆ హాల్‌లో నవ్వుల్లో నవ్వు అయ్యాడు. ఏడుపులో ఏడుపు అయ్యాడు. సకల భావోద్వేగాల సమ్మేళనంతో 'దాస్తాంగోయి' ఫౌజియాను ఆశీర్వదించాడు. ఉర్దూలో మౌఖిక కథాసాహిత్య కళారూపం... దాస్తాంగో. పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ కళారూపంలో అపారమైన పేరు తెచ్చుకొని 'ఫస్ట్ ఫిమేల్ దస్తాంగోయి'గా గుర్తింపు పొందింది ఫౌజియా...



ఫౌజియా

ఢిల్లీకి చెందిన ఫౌజియాకు స్కూల్ రోజుల నుంచి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఇష్టం. స్కూల్లో ప్రదర్శించే నాటకాల్లో పాల్గొనేది. ఫౌజియా తండ్రి మోటర్‌బైక్ మెకానిక్. ఆర్థిక పరిస్థితి రీత్యా ఫౌజియా ఎప్పుడో చదువు మానేయాలి. ట్యూషన్‌లు చెప్పగా వచ్చిన డబ్బుతో పై చదువులు చదివింది. మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేసింది.

దయాల్ సింగ్ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఒకరోజు తొలిసారిగా 'దాస్తాంగో' ప్రదర్శన చూసింది ఫౌజియా. ఇక అప్పటి నుంచి 'దాస్తాంగో'పై ఆసక్తి, అభిమానం పెరిగాయి. తాను కూడా 'దాస్తాంగోయి'గా పేరు తెచ్చుకోవాలనుకుంది. 'ఇది పురుషులకు మాత్రమే పరిమితమైన కళారూపం. మహిళలు చేయలేరు. ఒకవేళ చేసినా ప్రేక్షకులు ఆదరించరు' అన్నట్లుగా చాలామంది మాట్లాడారు.


ఆ మాటలు విని ఫౌజియా కొంచెం కూడా నిరాశపడలేదు. తనపై తనకు గట్టి నమ్మకం ఉంది.

'జీవితాంతం దాస్తాంగో చెంతనే ఉండాలనుకున్నాను. ఎంతో చరిత్ర ఉన్న ఈ కళ గురించి ఈ తరంలో కొద్ది మందికి మాత్రమే తెలుసు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ తరానికి కూడా తెలిసేలా దాస్తాంగోకు ప్రాచుర్యం తీసుకురావాలనుకున్నాను' అంటుంది ఫౌజియా. డానీష్ హుస్సేన్, మహ్మద్ ఫారూఖీ లాంటి గొప్ప కళాకారుల నుంచి 'దాస్తాంగో'ను నేర్చుకుంది ఫౌజియా. ఫౌజియా కథాసంవిధానంలో కృత్రిమమైన భాషా గాంభీర్యం వినిపించదు. పాత ఢిల్లీ యాస మాత్రమే వినిపిస్తుంది.

'మన దేశంలో ఎన్నో భాషలకు సంబంధించి ఎన్నో మాండలికాలు ఉన్నాయి. ప్రతి మాండలికానికి తనదైన సొగసు ఉంటుంది. ఈతరంలో చాలామంది తమ యాసను దాచి పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఇది సరి కాదు. మన ఊరు, తల్లిదండ్రులు, సంస్కృతి గురించి గొప్పగా చెప్పుకున్నట్లే మన మాండలికం గురించి కూడా గొప్పగా చెప్పుకోవాలి' అంటుంది ఫౌజియా.

ఫౌజియాకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. ముఖ్యంగా ఉర్దూ సాహిత్యం. చిన్నప్పుడు అమ్మ, అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు...'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.

అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు... 'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.



జానపద కథలు మాత్రమే కాకుండా సామాజిక సందేశం ఉన్న ఆధునిక కథలను కూడా చెబుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఫౌజియా. దేశవిభజన సమయంలో మహిళలు ఎదుర్కొన్న సమస్యలు, హింస గురించి కథగా చెబుతున్నప్పుడు ప్రేక్షకులు కదిలిపోయారు. కోవిడ్ కల్లోల సమయంలో ఫౌజియాకు 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వడానికి కుదరలేదు. దీంతో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే ప్రదర్శన ఇచ్చింది.

మహాభారతం కథల నుంచి స్వాతంత్ర్యం కోసం మహాత్ముడి పోరాటం వరకు 'దాస్తాంగోయి'గా ప్రేక్షకులను మెప్పిస్తున్న ఫౌజియాకు ఉర్దూ భాషలోనే కాదు హిందీ, ఇతర భాషలలోనూ 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వాలనేది కల. ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.